ప్రజాశక్తి

మంగళవారం 10 సెప్టెంబరు 2024

5

శ్రీకాకుళం

ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ 17వ బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎపిఎస్ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 17వ బ్యాచ్ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చాలా కష్టమైందని, శరీరంలో చాలా అవయవాలు సమన్వయం చేసుకుని వాహనాలను నడపాల్సి ఉంటుందన్నారు. దీనికితోడు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సిగ్నల్స్ పాటించి డ్రైవింగ్ చేయాలన్నారు. నెలరోజుల పాటు క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటి, రెండో డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : తాడివలస వద్ద ముంపునకు గురైన వరిపంట పొలాలు

వరదనీటిలోనే పంటలు

- మూడు వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న నీట మునక
- పొంగిన వాగులు, గెడ్డలు
- పలుచోట్ల నిలిచిన రాకపోకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న మహేంద్రతనయ
- రైల్వే అండర్ పాసేజ్‌ల్లోకి వరద నీరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఒడిశాలోని పూరీ సమీపంలో వాయుగువండం తీరం దాటడంతో ఇచ్ఛాపురం నియోజకవర్గంపై వర్షం ప్రభావం చూపింది. ఆ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. రహదారుల పైకి వరద నీరు చేరడంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వర్షాలతో కోటబొమ్మాళి, ఆమదాలవలస ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. మహేంద్రతనయ నది ఉధృతంగా ప్రవహిస్తుండగా... వంశధార, నాగావళి నదులు సాధారణ స్థాయిలోనే ప్రవాహం ఉంది.

వాయుగుండం ప్రభావంతో జిల్లాలో గడిచిన 24 గంటల్లో సగటున 10.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కవిటిలో అత్యధికంగా 95.4 మి.మీ భారీ వర్షం కురిసింది. కంచిలిలో 76.8 మి.మీ వర్షం పడింది. సోంపేటలో 52.2 మి.మీ, ఇచ్ఛాపురంలో 50.6 మి.మీ వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. పలాస మండలం బ్రాహ్మణతర్లా, కంబిరిగాం ప్రాంతాల్లో వరహాల గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. కిష్టుపురం సమీపంలో ఉన్న సవరగెడ్డకు వరద నీరు వచ్చి చేరడంతో అండర్ పాసేజ్‌లో సుమారు మూడు అడుగుల మేర నీరు చేరింది. దీంతో మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. పొందూరు మండలంలోని రెల్లిగెడ్డకు వరదనీరు పోటెత్తడంతో వంతెనలను ముంచెత్తి ఉధృతంగా ప్రవహించింది. ప్రధానంగా మండలంలోని లైదాం వద్ద రెల్లిగెడ్డ ఉధృతి కారణంగా వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో విజయనగరం జిల్లాలోని సంతకవిటి-పొందూరు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రెల్లిగెడ్డ కారణంగా గోకర్ణపల్లి, మొదలవలస వద్ద వంతెనల పైనుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపివేశారు. మండలంలోని బొడ్డేపల్లి, పెనుబర్తి రైల్వే అండర్‌పాస్‌ల్లో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. మండలంలో టిడి వలస నుంచి మండాకురిటి వెళ్లే మార్గమధ్యలో వాగు పొంగి నీరు రోడ్డు మీద నుంచి ప్రవహిస్తోంది.

పలాస : ఉధృతంగా ప్రవహిస్తున్న వరహాల గెడ్డ

పొందూరు : లైదాం వద్ద సంతకవిటి-పొందూరు రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న రెల్లిగెడ్డ

2,738 ఎకరాల్లో వరి పంట నీట మునక

జిల్లాలో మూడు రోజులు కురుస్తున్న వర్షాలతో వరి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. జిల్లాలో మొత్తం 2,738 ఎకరాల మేర పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జి.సిగడాంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ భాగాన ఉన్న చెరువులు నిండిపోవడంతో అబోతులపేట విజయరామపురం, సంతవురిటి, అగ్రహారానికి చెందిన సుమారు వందెకరాల వరి పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి. పొందూరు మండలం రెల్లిగెడ్డ పోటెత్తడంతో దీని పరివాహక ప్రాంత గ్రామాలైన బొడ్డేపల్లి, తాడివలస, లైదాం, కొల్లిపేట, గోరింట, తుంగపేట, గోకర్ణపల్లి, మొదలవలస, సింగూరులో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. వరదనీరు పొలాలకు చేరడంతో వరి, మొక్కజొన్న పంటలు పూర్తిగా మునిగిపోయాయి.

ఉధృతంగా మహేంద్రతనయ

ఒడిశాలో కురుస్తున్న వర్షాలతో మహేంద్రతనయ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పాతపట్నం మండలం కాపుగోపాలపురం, హెచ్.గోపాలపురం గ్రామాలను పాతపట్నంతో కలిపే కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు ఆపేశారు. వరద ఉధృతి నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మహేంద్రతనయ నదిని పరిశీలించి, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. మెళియాపుట్టి మండలం రట్టి గ్రామాన్ని సందర్శించి వరద ప్రవాహాన్ని, నీట మునిగిన పంటలను చూశారు.

చెరువుకు గండి

కోటబొమ్మాళి మండలం తిలారు పంచాయతీ తిలారు- గవరమ్మపేట గ్రామాల మధ్య ఉన్న పెద్ద చెరువు గట్టుకు సోమవారం తెల్లవారుజామున గండి పడింది. సమాచారం తెలుసుకున్న గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి టి.రామకృష్ణ హుటాహుటిన యంత్రాల సహాయంతో మధ్యాహ్నానికి గండిని పూడ్చారు. విషయం తెలుసుకున్న మండల ప్రత్యేకాధికారి ఆర్.గడ్డెమ్మ, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి గండి పూడ్చే చర్యలు చేపట్టారు.

దెబ్బతిన్న ఇళ్లు

ఆమదాలవలస : కూలిన పెంకుటిల్లు

ఆమదాలవలస మున్సిపాల్టీ పరిధిలోని వెంగళరావు కాలనీకి చెందిన బడిగింటి సావిత్రమ్మకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. అదే కాలనీలో ఉన్న అముజూరు జ్యోతి, మేటికోటి సావిత్రమ్మకు చెందిన మట్టి గోడలతో ఉన్న పూరిళ్లు కూలిపోయాయి. కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురంలో ఎస్.కేసరమ్మకు చెందిన ఇంటి గోడ పాక్షికంగా కూలిపోయింది. కేసరమ్మ మృతి చెందడంతో అప్పట్నుంచీ ఆ ఇంట్లో ఎవరూ నివాసం ఉండడం లేదు. ఆ ఇంటికి ఆనుకొని ఉన్న చాప లక్ష్మి ఇంటికి ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు చెప్తున్నారు. సరుబుజ్జిలి మండలం బురిడివలస పంట పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. విద్యుత్ శాఖ ఎఇ పి.వి అప్పలనాయుడు ఆధ్వర్యాన ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేసి చిగురువలసకు విద్యుత్‌ను పునరుద్ధరించారు.

సాధారణ స్థితిలో వంశధార, నాగావళి

వంశధార, నాగావళి నదులు సాధారణ స్థితిలోనే ప్రవహిస్తున్నాయి. వంశధారలో రాత్రి ఏడు గంటల సమయానికి ఇన్‌ఫ్లో 11,439 క్యూసెక్కులుగా ఉంది. ఒడిశాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మంగళవారం గరిష్టంగా 16 వేల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. నారాయణపురం వద్ద నాగావళి ప్రవాహం 13,500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఈనెల ఎనిమిదో తేదీతో పోలిస్తే సుమారు ఐదు వేల క్యూసెక్కులు తగ్గింది.

వర్షాలు తగ్గినా అప్రమత్తం : కలెక్టర్

వర్షాలు తగ్గుముఖం పట్టినా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒడిశాలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గిన తర్వాత సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం పనులు ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాలతో జిల్లాలో 20 చోట్ల రహదారులకు అంతరాయం కలగగా, 10 చోట్ల పునరుద్ధరించినట్లు తెలిపారు. 43 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. రెండు చెరువులకు గండ్లు పూడ్చినట్లు చెప్పారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించామన్నారు. 11 విద్యుత్ స్తంభాలు పడిపోగా, కొత్తవి వేసినట్లు తెలిపారు. ఏడు గొర్రెలు, ఒక ఎద్దు మృతి చెందాయన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

115 జిఒ రద్దు చేయాలి

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలోని పలు ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని స్టాఫ్ నర్సుల సంఘం నాయకులు వేదవతి, లక్ష్మీబాయి డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో భోజన విరామ సమయంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఇటీవల జారీ చేసిన 115 జిఒను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జిఒ వల్ల కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,200 మంది స్టాఫ్ నర్సులు (మేల్, ఫిమేల్) కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారని, నర్సింగ్ విద్యతో పాటు పిజి, పిహెచ్‌డి చేసిన వారూ వీరిలో ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఎఎన్‌ఎం నుంచి జిఎన్‌ఎం ఉద్యోగోన్నతి కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2,112 మందికి శిక్షణ తీసుకున్నారని, నామమాత్రపు శిక్షణ ఇచ్చి ఉద్యోగోన్నతి కల్పించడం సరికాదన్నారు.

2,112 మంది సచివాలయ ఎఎన్‌ఎంలకు రాష్ట్రంలోని పలు ఆస్పత్రుల్లో స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వర్తించేందుకు నియమిస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం ఆందోళనకరమన్నారు. వీరికి జీతంతో పాటు ప్రతి నెలా రూ.ఐదు వేలు అదనపు ప్రోత్సాహాన్ని ప్రభుత్వం చెల్లించబోతుందని చెప్పారు. దీనివల్ల స్టాఫ్ నర్సు పోస్టుల్లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. అన్నిరకాల శిక్షణ పొంది కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పున:సమీక్షించుకోవాలన్నారు. ప్రభుత్వం ఇష్టారీతిగా ఎఎన్‌ఎంలను జిఎన్‌ఎంలుగా నియమిస్తే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

పంట నష్టాలపై ప్రభుత్వానికి నివేదిక

వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్

ప్రజాశక్తి - పోలాకి

వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పంటలకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ తెలిపారు. మండలంలోని సుసరాం, ప్రియాగ్రహారం వద్ద నీటమునిగిన పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఎంత విస్తీర్ణం మేర ఎంత శాతం నీట మునిగిందన్నది వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నరసన్నపేట నియోజకవర్గంలో జలుమూరు మండలంలో 270 ఎకరాలు, పోలాకి మండలంలో 60 ఎకరాల వరకు నీట మునిగిందని తెలిపారు. వర్షాల వల్లే కాకుండా ఓపెన్ హెడ్ ఛానళ్లలో ప్రవాహం ఉధృతంగా ఉండడం వల్ల ఎక్కువ శాతం నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. అమూల్య, స్వర్ణ తదితర రకాలు నీటిని ఎక్కువ తట్టుకోలేవని... 1061, 1024 రకాలైతే ఐదు రోజుల వరకు నీటి ముంపును తట్టుకుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లితే నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తామన్నారు. నీరు తగ్గిన వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఉదయ్‌బాబు, మధు, ఎడిఎ రవీంద్ర భారతి, మండల వ్యవసాయ అధికారి చిరంజీవి, మండల ప్రత్యేకాధికారి ఆర్.వెంకట్రామన్, తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రియాగ్రహారం వద్ద నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నిమజ్జనాల్లో జాగ్రత్తలు తప్పనిసరి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాల్లో జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో ప్రమాదాల నేపథ్యంలో జిల్లా పోలీసు, రెవెన్యూ అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు అప్రమత్తం చేశారు. చెరువులు, కాలువలు నీటితో నిండి ఉండడంతో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. చిన్న పిల్లలను నిమజ్జన కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని, యువత జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

భద్రతా నియమాలు పాటించాలి : ఎస్‌పి

వినాయక నిమజ్జన ప్రదేశాల్లో భద్రతా నియమాలను పాటించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి సూచించారు. నగరంలోని కలెక్టరేట్ రహదారి మార్గంలో ఉన్న పొన్నాడ వంతెన ఇరువైపులా వినాయకుని విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశాలను ఎస్‌పి సోమవారం పరిశీలించి భద్రతాపరమైన ఏర్పాట్లపై ఆరా తీశారు. జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నాగావళి నదిలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నందున పొన్నాడ, గుజరాతీపేట, డే అండ్ నైట్ వంతెనల ఇరువైపులా నిమజ్జనం చేసే ప్రదేశాల్లో తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇతర విభాగాల సమన్వయంతో నిమజ్జన ప్రదేశాల్లో లైటింగ్, క్రేన్లు, ఈతగాళ్లు, లైవ్ బోట్స్, అంబులెన్స్ తదితర వాటిని, అవసరమగు సిబ్బందిని ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఊరేగింపు మార్గంలో విద్యుత్ లైన్లపై జాగ్రత్త వహించాలని, ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా క్రమపద్ధతిలో ఒకేవైపు ఊరేగింపు కొనసాగాలన్నారు. ఊరేగింపు సమయంలో డిజెలను పరిమితికి మించిన శబ్దంతో వినియోగించరాదని స్పష్టం చేశారు. వరదల కారణంగా వాగులు, కాలువలు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున వినాయక విగ్రహాలను స్వతహాగా నిమజ్జనం చేయరాదన్నారు. గజ ఈతగాళ్లు, క్రేన్ల సహాయంతో మాత్రమే నిమజ్జనం చేయించాలని చెప్పారు. నిమజ్జన ప్రదేశాల్లోకి చిన్నపిల్లలు, మద్యం సేవించి ఉన్న వారిని అనుమతించరాదన్నారు. అనుమతుల్లేని ప్రదేశంలో నిమజ్జనం చేయరాదని స్పష్టం చేశారు. నిమజ్జనం వివరాలను ముందుగానే సంబంధిత పోలీసు అధికారులకు తెలపాలని, పోలీసులు సూచించిన నియమాల ప్రకారం నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించాలన్నారు. ఆయన వెంట డిఎస్‌పి సి హెచ్.వివేకానంద్, సిఐలు పైడిపునాయుడు, ఇమ్మాన్యుయల్ రాజు ఉన్నారు.

పొన్నాడ వంతెనను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

- ఆరుగురు అరెస్టు
- 25 కేజీలు స్వాధీనం
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

జిల్లావ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.25.560 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక సిఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇచ్ఛాపురం మండలం పురుషోత్తపురానికి చెందిన బుగ్గ చిరంజీవి, టి.కృష్ణ సాహు, బుగ్గ సావిత్రి, ఒడిశాకు చెందిన తిన్‌పొరియాకు చెందిన రబింద్ర సేతి, సింహాచల సేతు, తమిళనాడులోని నెట్టూరుకు చెందిన రమేష్ వెలయూతం ఇచ్ఛాపురం సరిహద్దు పురుషోత్తపురం పాత చెక్‌పోస్టు వద్ద పాన్‌షాపులో లారీ డ్రైవర్లకు గంజాయిని విక్రయిస్తున్నారని తెలిపారు. స్పెషల్ బ్రాంచ్, కాశీబుగ్గ సబ్ డివిజన్ పోలీసు అధికారులు, స్థానిక సిఐ, ఎస్‌ఐలు ప్రత్యేకంగా నిఘా పెట్టి నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. తమిళనాడుకు చెందిన డ్రైవర్ ఇక్కడ తక్కువ ధరకి కొనుగోలు చేసి, తమిళనాడులో ఎక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుల నుంచి ఒక ద్విచక్ర వాహనంతో పాటు ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి క్రయ విక్రయాలు, రవాణాపై సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. పిల్లలు మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు నిరంతరం కనిపెడుతూ ఉండాలని సూచించారు. గంజాయి ముఠాను పట్టుకున్న పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐలు ఎం.చిన్నంనాయడు, టి.ఇమ్మాన్యుయల్ రాజు, ఎస్‌ఐలు చిన్నంనాయడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

15న జిల్లాస్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి - టెక్కలి

జిల్లాస్థాయి ఓపెన్ చదరంగం పోటీలను మండలంలోని తెలినీలాపురంలో ఈనెల 15 వతేదీన నిర్వహించనున్నట్లు చదరంగం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. వయోపరిమితి లేకుండా ఈ పోటీల్లో పాల్గొవచ్చని స్పష్టం చేశారు. విజేతలకు రూ.పది వేల నగదు బహుమతితో పాటు మెమొంటోలను అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9912559735 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

13, 14న రాష్ట్రస్థాయి చేనేత సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చేనేత ఉత్పత్తుల విక్రయాలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఆధ్వర్యాన విజయవాడ ఎంజి రోడ్డులోని శేషసాయి కళ్యాణ మండపంలో ఈనెల 13,14 తేదీల్లో రాష్ట్రస్థాయి విక్రయదారులు, కొనుగోలుదారుల సమావేశాన్ని నిర్వహిస్తున్న ఆ శాఖ ఎడి సిహెచ్.సాయిప్రసాద్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని పలు చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్, స్వతంత్ర చేనేత కార్మికులు ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలను ఇక్కడ ప్రదర్శిస్తారని తెలిపారు. జిల్లాలోని చేనేత ఉత్పత్తిదారులు ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు.

పేరు మార్పు

నా క్లయింట్ పేరు ఒరిజినల్‌గా **మాసుపత్రి నూకరాజు**, S/o కృష్ణారావు. చిరునామా: ఇంటి నంబరు 3-161, ఎగువ వీధి, సన్యాసి పుట్టుగ గ్రామం, కేసుపురం పోస్టు, ఇచ్ఛాపురం మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్. పిన్ కోడ్ 532312, తన సర్టిఫికేట్‌లో, ఆధార్ కార్డులో మరియు అన్ని ఇతర ముఖ్య వాటిలో **మాసుపత్రి నూకరాజు** అని ఉంది. కానీ గతం లో తన పాస్ పోర్ట్‌లో **మాసుపర్తి నూకరాజు** అని ఇంటి పేరు తప్పుగా ముద్రించడం జరిగింది. కావున నా క్లయింట్ యొక్క పూర్తి పేరు **మాసుపత్రి నూకరాజు** గా పరిగణించాలి.

భగవాన్ దాస్, న్యాయవాది, ఇచ్ఛాపురం.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి దివ్య సముఖమునకు

IP. 11/2024

Between :

Yarlanki Jeevanadash, S/o. Late Appayya, Hindu aged about 40 years, permanent resident of Door No. 1-297, BC Veedhi, Chinnadimili, Bhamini mandal, Erstwhile Srikakulam district, now Parvathipuram Manyam district, presently residing at near Anjaneya swamy temple, Kousalyapuram village, Balada post, Kotturu mandal, Srikakulam district, Aadhaar No.585820144508 --Petitioner

And:

Bandana Savitramma, and 32 others ---Respondents

జనరల్ నోటీసు

పై నెంబరు గల పిటిషన్ లో పిటిషనర్ తనను ఇన్ సాల్వెంట్ పర్సన్‌గా డిక్లేర్ చెయ్యమని దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ లో ఎవరికైన ఎట్టి అభ్యంతరములున్నచో **తే॥ 12-09-2024 ఉ॥10:30 ని॥ లకు** పైన తెలిపిన కోర్టు యందు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తెలియజేయవలెను . లేనియడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

డి.టి. మణి చందన్
అడ్వకేట్, ఫరీదుపేట, ఎచ్చెర్ల,
శ్రీకాకుళం,సెల్ : 8919146438.

చెక్కును అందజేస్తున్న ఎస్పి మహేశ్వర రెడ్డి

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

శ్రీకాకుళం: జిల్లా హోంగార్డు యూనిట్, బ్యాండ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మరణించిన హోంగార్డు టి.కాంతారావు కుటుంబ సభ్యులకు జిల్లాలో సహచర హోంగార్డులు అందించిన ఒక్కరోజు గౌరవ వేతనం రూ.4 లక్షల 13వేలు చెక్కును సోమవారం పోలీసు కార్యాలయంలో ఎస్పి కె.వి.మహేశ్వర రెడ్డి చేతులమీదుగా కాంతారావు సతీమణి లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ హోంగార్డు కాంతారావు మరణించడం చాలా బాధాకరమని, కాంతారావు కుటుంబానికి పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. విధులు నిర్వర్తిస్తూ మరణించిన లేదా పదవీ విరమణ పొందిన హోంగార్డుల కుటుంబ సభ్యులకు జిల్లాలో పనిచేస్తున్న తోటి హోంగార్డులు అండగా ఉండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట రమణ, హోంగార్డు కుటుంబసభ్యులు ఉన్నారు.

ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ఈశ్వర ట్రస్టు నగదు ప్రోత్సాహకం

శ్రీకాకుళం అర్బన్: నగరంలో పిఎస్ఎన్ఎం హైస్కూల్ విద్యార్థిని సింగూరు జోత్స్న ఈ ఏడాది మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో 567 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలవడం అభినందనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావులు అన్నారు. సోమవారం గొర్తి ఈశ్వర ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉషా బాల, పవన్ కుమార్ దంపతుల ఆధ్వర్యాన రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాన్ని ఎమ్మెల్సీ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్తి ఈశ్వర ట్రస్ట్ చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సమన్వయకర్త బోను అప్పల నాయుడు, హెచ్ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు బి.శంకరరావు, నారాయణరావు, సదాశివుని శంకరరావు, పైడి భాగ్యలక్ష్మి, వెంకటరమణ, చంద్రకళ, రాజేష్, సుప్రియ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న అధికారులు

రోడ్డుకు మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

మెళియాపుట్టి: మండలంలో పలురోడ్ల దుస్థితిపై 'ప్రజాశక్తి'లో సోమవారం అధ్వానంగా రహదారులు అనే కథనాన్ని ప్రచురితమైంది. దీంతో ఎంపిడిఒ పడాల చంద్రకుమారి, తహశీల్దార్ ఎం.హనుమంతరావు స్పందించారు. ఈ మేరకు గోపినాథపురం సమీపంలోని కల్వర్టు వద్ద గుంతలను పూడ్చివేశారు. అలాగే పట్టుపురం సమీపంలోని రోడ్డుపైకి వచ్చిన రెల్ల గడ్డిని ఇరువైపులా తొలగించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి తిరుపతి పట్నాయక్, సర్పంచ్ ప్రతినిధి శంకరరావు, విఆర్ఒ అన్నాజీరావు, మాజీ సర్పంచ్ వరిసి గణపతిరావు, కంచరాన లావుడు పాల్గొన్నారు.

మిలటరీ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశవ్యాప్తంగా ఉన్న మిలటరీ స్కూళ్లలో 6, 9 తరగతుల్లో అడ్మిషన్లు చేపట్టనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి పూర్తిచేసిన, చదువుతున్న విద్యార్థులు ఈ నెల 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొమ్మిదో తరగతిలో అడ్మిషన్ కోసం ఎనిమిదో తరగతి పూర్తిచేసిన, లేక చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తారని వివరించారు. పూర్తి వివరాల కోసం www.rashtriyamilitaryschools.edu.in వెబ్ సైట్‌ను సందర్శించాలన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఎచ్చెర్ల : మండలం కేంద్రంలో తారక రామారావు నైపుణ్యాభివృద్ధి మహిళా సాధికార కేంద్రం ప్రాంగణంలో నిరుద్యోగ మహిళలకు, గృహిణులకు ఉద్యోగ నైపుణ్య శిక్షణ కోర్సులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ కె.పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, టైలరింగ్, మగ్గం కోర్సుల్లో ప్రవేశాల కోసం 18 నుంచి 40 ఏళ్ల వయసు గల అభ్యర్థులు ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 8333921337, 7416764419 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రేపు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

మందస : మండలంలోని అంబుగాం పంచాయతీ పెద్దలింబంగాంలో వరసిద్ధి వినాయక సందర్భంగా బుధవారం ఎంపియుపి స్కూల్‌లో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ క్విజ్ పోటీలో పాల్గొవాలని కోరారు. ఆసక్తిగల వారు 6300748013, 9014057431 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రానైట్‌కు అనుమతులు ఇవ్వాలి

ప్రజాశక్తి- టెక్కలి

మూడు నెలలుగా గ్రానైట్ క్వారీలకు అనుమతులు మంజూరు చేయకుండా ప్రభుత్వం, అధికారులు అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ గ్రానైట్ క్వారీ యజమానులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక భూగర్భ గనుల శాఖ కార్యాలయ ఎడి పనిభూషణ్ రెడ్డికి వినతిపత్రం అందించారు. జిల్లాలో గ్రానైట్ క్వారీలకు అనుమతులు లేకుండా, తీసిన రాయికి పర్మిట్లు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. దీంతో ఆర్థిక సంక్షోభంలో క్వారీ యజమానులు ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. అలాగే ఇప్పటివరకు తీసిన గ్రానైట్ బ్లాకులకు పర్మిట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.ఎం.ఎం.హరికుమార్, శ్రీనివాస్, పోలాకి చంద్రశేఖర్, అల్లు గణేష్, బొడ్డేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసిపి రెడ్డిక రాష్ట్ర అధ్యక్షునిగా లోకేశ్వరరావు రెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

లోకేశ్వరరావు రెడ్డి

వైసిపి అనుబంధ రెడ్డిక విభాగ రాష్ట్ర అధ్యక్షునిగా రెడ్డిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు రెడ్డిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. లోకేశ్వరరెడ్డి 25 ఏళ్లుగా ఒడిశా రాష్ట్రం గంజాం, శ్రీకాకుళం జిల్లా రెడ్డిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎనిమిదేళ్ల పాటు పనిచేశారు. అలాగే మూడేళ్ల పాటు రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్‌గా చేశారు. ఆయన సేవలను గుర్తించిన వైసిపి అధిష్టానం రెడ్డిక రాష్ట్ర అధ్యక్షునిగా నియమించారు. దీంతో మాజీ సిఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మునిగిన పంట పొలాలు పరిశీలన

ఆమదాలవలస : పంట పొలాలను పరిశీలిస్తున్న ఎఒ మోహనరావు

బూర్జ : పంట పొలాలను పరిశీలిస్తున్న ఎఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని దూసి గ్రామం వద్ద 30 ఎకరాల పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. కొత్తగడ్డ నీటి ప్రవాహం ఒక్కసారిగా పొంగడంతో పంట పొలాల్లోకి నీరు చేరి ముంపునకు గురయ్యాయి. సోమవారం మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు మండలంలోని కోర్లకోట, చీమలవలస, తొగరాం, కలివరం, దూసి గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. దూసిలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా తక్షణమే బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని రైతులకు సూచించారు. ఈ పరిశీలనలో ఎఇఒ రమణమూర్తి, విలేజ్ అగ్రికల్చల్ అసిస్టెంట్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురిసిన వర్షాలు సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆగి వాతావరణంలో మార్పు రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని పాతపాడు, తెలికిపెంట, వీరభద్రపురం, కూన జమ్మన్నపేట, సరుబుజ్జిలి గ్రామాల్లో కొత్తూరు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రాజగోపాలరావు, మండల ఎఒ బి.పద్మనాభంతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం సరుబుజ్జిలిలో రామమందిరం వద్ద ఎడి రైతులతో మాట్లాడి ప్రస్తుతం వర్షాలతో తడిసి ఉన్న వరి పైరుపై వ్యవసాయ శాఖ అందించే సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు.

బూర్జ: రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలను తప్పకుండా పాటిస్తే పంటకు ఎటువంటి నష్టం వాటిల్లదని ఎఒ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలను పెద్దపేట, పనుకుపర్త గ్రామాల్లో పరిశీలించారు. వరి పంట పిలకలు పెట్టే దశలో ఉన్నందున నీటిలో 72 గంటలకు మించి ఉంటే కాండం, వేరు వ్యవస్థ కుళ్లి నష్టం జరుగుతుందన్నారు. వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత బూస్టర్ డోస్ కింద ఎకరాకు 20 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ వేసుకోవాలని సూచించారు. పెద్దపేట, పాలవలస విఎఎలు జగదీష్, హేమలత పాల్గొన్నారు.

మహేంద్ర తనయ కాజ్‌వే పరిశీలన

పాతపట్నం: అల్పపీడనం కారణంగా శని, ఆదివారాలు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని మహేంద్ర తనయ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. టెక్కలి ఆర్‌డిఒ సుదర్శన్‌దొర నీలకంఠేశ్వర ఆలయం వద్ద కాజ్‌వేను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద ఉధృతి తగ్గే వరకూ రాకపోకలను నిలిపివేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే నది వైపు ఎవరినీ వెళ్లనీయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈయనతో పాటు మండల ప్రత్యేకాధికారి కె.జయ్‌కార్తీక్, తహశీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంపిడిఒ జయంతిప్రసాద్ ఉన్నారు.

మహేంద్ర తనయ నదిని ఆనుకొని ఉన్న కాపుగోపాలపురం, పెచ్చుగోపాలపురం గ్రామాలకు వెళ్లే కాజ్ వే బ్రిడ్జి పైనుంచి నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. సిఐ ఎన్.సాయి, ఎస్ఐ బి.లావణ్యలు డేంజర్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ఎవరూ వెళ్లకూడదని, వినాయకుల నిమజ్జనం కూడా చేయరాదని సూచించారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది రాత్రి, పగలు అక్కడే విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మెళియాపుట్టి : మండలంలో మహేంద్ర తనయ నది ముంపు ప్రాంతాలైన రట్టిని వంశధార ఇఇ శేఖర్‌బాబు సోమవారం పరిశీలించారు. వరద నీటి పరిస్థితి, పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎం.రవికృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ హస్బండరీ, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, తహశీల్దార్ ఎం.హనుమంతరావు, ఇఒపిఆర్‌డి తిరుపతి పట్నాయక్, ఆర్ఐ వైకుంఠరావు, విఆర్ఒలు రమణ, అన్నాజీరావు, సర్పంచ్ ప్రతినిధి హరిచంద్ర, శ్యామల పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : పంట పొలాలను పరిశీలిస్తున్న ఎడి రాజగోపాలరావు

పాతపట్నం : అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సుదర్శన్‌దొర

జెసి పరిశీలన

పాతపట్నం : పాతపట్నం-పర్లాకిమిడి మధ్య ఉన్న మహేంద్ర తనయ నది వరదనీటి ప్రవాహం పెరిగింది. వరద ఉధృతిని జెసి ఫర్మాన్ అహ్మద్ సోమవారం పరిశీలించారు. నదికి ఆనుకుని ఉన్న గ్రామస్తులను అప్రమత్తం చేయాలని మండలస్థాయి అధికారులకు ఆదేశించారు. ఈయన వెంట ఆర్ఐ భవన్‌కుమార్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మహేంద్ర తనయ నది ముంపు ప్రాంతాలైన రట్టిని జెసి ఫర్మాన్ అహ్మద్ పరిశీలించారు. నదిలోని వరద ఉధృతిని, ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. రట్టి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులను అప్రమత్తం చేశారు.

మెళియాపుట్టి : రికార్డులను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్

కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ సుదర్శన్‌దొర, వంశధార ప్రాజెక్టు ఇఇ శేఖర్‌బాబు, మండల ప్రత్యేకాధికారి ఎం.రవికృష్ణ, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, తహశీల్దార్ ఎం.హనుమంతురావు, ఇఒపిఆర్‌డి తిరుపతి పట్నాయక్, ఎఒ దానకర్ణుడు, ఆర్ఐ వైకుంఠరావు, విఆర్ఒలు రమణ, అన్నాజీరావు, సర్పంచ్ ప్రతినిధి హరిచంద్ర పాల్గొన్నారు.

వరద ముప్పుపై అప్రమత్తం

ప్రజాశక్తి- పొందూరు

అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం వర్షాలు, వరదలపై అధికారులు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలు కారణంగా రెల్లిగెడ్డకు వరదనీరు పోటెత్తడంతో అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను పర్యవేక్షించాలన్నారు. నాగావళికి వరదనీరు పెరుగుతుండడంతో నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకుండా ముందుస్తుగా రైల్వే అండర్‌పాస్‌లు వద్ద రాకపోకలను నిలిపివేశామన్నారు. వరదనీరు తగ్గుముఖం పట్టిన తరువాత పంట నష్టాలను అంచనా వేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ ఎన్. రమేష్ కుమార్, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, టిడిపి నాయకులు అన్నెపు రాము, బాడాన గిరి, అనకాపల్లి శ్రీరంగనాయకులు, బలగ శంకర భాస్కరరావు పాల్గొన్నారు.

వరద ప్రభావంపై ఎమ్మెల్యే సమీక్ష

కంచిలి: అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షం వల్ల మండల పరిధిలో వరద ప్రభావంపై తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం అధికారులతో సమీక్షించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కురిసిన వర్షానికి పంట పొలాలు నీట మునిగాయా? లేదా? రహదాలను పరిస్థితి, ఇతర శాఖలపై నష్టాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వరద నీరు ఎక్కడ నిల్వ లేకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. నారాయణ బట్టి గ్రామ సమీపంలో వరద నీటిని స్థానిక తహశీల్దార్ విజయలక్ష్మి పరిశీలించారు. మండల ఎఒ ధనంజయం సిబ్బందితో కలిసి పంటల పొలాలను పరిశీలించారు. పొలాల్లో నీరు నిలవకుండా రైతులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో ప్రత్యేక అధికారి, పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రఘునాథ్, ఎంపిడిఒ నీరజ పాల్గొన్నారు.

ఇద్దివానిపాలెంను సందర్శిస్తున్న ఎమ్మెల్యే, ఆర్‌డిఒ

సోంపేట : వర్షాల కారణంగా నీరు నిలువ ఉండకుండా పారిశుధ్య మెరుగుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్థానిక ఎమ్మెల్యే అశోక్ ఆదేశించారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కంట్రోల్ రూమ్ వివరాలను అధికారులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. బాలికోన్నత పాఠశాల వద్ద వర్షపు నీరు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించడంతో పంచాయతీ ఇఒ శాంతికుమారి పనులు చేపట్టారు. బాతుపురం సమీపంలోని పైడిగాం ఛానల్ వద్ద వరద ఉధృతిని తహశీల్దార్ అప్పలస్వామి, బారువ ఎస్ఐ చంద్రశేఖర్, డిటి గౌరీశంకర్‌లతో పరిశీలించారు.

ఎమ్మెల్యేను కలిసిన మత్స్యకార అభివృద్ధి అధికారి

మండలంలోని పోత్రఖండకు చెందిన విశాఖపట్నం ఫిష్షింగ్ హార్బర్ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి దడ్డ మురళి ఎమ్మెల్యే అశోక్‌ని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. కార్యక్రమంలో బేసి దాసు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కవిటి: అల్పపీడనం ప్రభావం మండలంపై తీవ్రంగా ఉంటుందని, అది తీరం దాటిన అధికారులు మాత్రం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఆర్‌డిఒ భరత్ నాయక్ అధికారులకు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని అధికారులతో సోమవారం సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే, ఆర్‌డిఒ ఇద్దివాని పాలెంను సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. పొగురు ఏర్పడే ప్రాంతాన్ని పరిశీలించి వ్యవసాయ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం బొరివంకలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె.అప్పలస్వామి, తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రాము, ఎంఇఒ ధనుంజయ మజ్జి, డిటి రామచంద్రరావు, హెచ్ఒ పి.మాధవీలత, హౌసింగ్ ఎఇ సాయికిరణ్, మండల జెఇ ప్రవీణ్‌కుమార్, ఇఒపిఆర్‌డి శివాజీ పానిగ్రాహి, ఎపిఒ గోవిందరావు, ఎపిఎం మోహనరావు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ సర్వమంగళ వీధిలో నివాసం ఉంటున్న ఆశా వర్కర్ సనుపల సరస్వతి సోమవారం నిద్ర మాత్రలు తీసుకుని ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారస్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సరస్వతి కథనం మేరకు... అల్పపీడనం కారణంగా 9 నెలల నిండిన గర్భిణులను ఆస్పత్రులో చేర్పించాలని పిహెచ్‌సి డాక్టర్ ఎఎన్ఎంలకు ఆదేశించారు. ఈ విషయంపై స్థానిక సచివాలయం-3 ఎఎన్ఎం హేమలత ఆశావర్కర్‌కి సరస్వతికి సమాచారం ఇచ్చారు. ఆమె పరిధిలో ఉన్న గర్భిణి మూడు నెలల క్రితం నౌపడకు వెళ్లిపోయింది. అక్కడ పనిచేస్తున్న ఆశా వర్కరు గర్భిణిని టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై సచివాలయం ఎఎన్ఎం హేమలత సరస్వతిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. గర్భిణిని తీసుకున్నామని చెప్పానని, నీకు చేత కాకపోతే మానేయని దుర్భాషలాడింది. దీంతో సరస్వతి మనస్తాపానికి గురై ఆత్మహత్యానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న ఆశావర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షులు డి.ధనలక్ష్మి, సిఐటియు నాయకులు నంబూరి షణ్ముఖరావు, హనుమంతు ఈశ్వరరావు పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రణస్థలం రూరల్ : మండలంలోని పైడి భీమవరంలో ఉన్న మద్యం షాపు ఎదురుగా కొలుసు బంగారప్పడు (25) అనుమానాస్పదస్థితిలో సోమవారం మృతి చెందారు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం ఓంపల్లికి చెందిన బంగారప్పడు పైడి భీమవరం పారిశ్రామిక వాడలోని ఎపిటోరియో (అరబిందో) పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నాడు. విజయ నగరం జిల్లా పూసపాటిరేగ మండలంల అల్లాడ పాలెంలో ఉంటున్న తన అక్క గుర్ల గంగ దగ్గర ఉంటూ పరిశ్రమలో పనికి వెళ్తున్నాడు. అయితే ఈ నెల 5న ఇంటికి వెళ్లకుండా ఆ రోజు నుంచి మద్యం తాగి తిరిగాడని స్థానికులు చెబుతున్నారు. సోమవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఒంటిపై గాయాలు ఉండడంతో మృతుడి అక్క గంగ ఫిర్యాదు మేరకు అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని జె.ఆర్.పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఎటిఎంలో చోరీకి విఫలయత్నం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కళింగరోడ్డులో టౌన్ హాల్ రోడ్డుకు సమీపంలో ఉన్న ఎస్‌బిఐ ఎటిఎంలో నగదు చోరీకి గుర్తు తెలియని వ్యక్తులు విఫలయత్నం చేశారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఎటిఎంలోకి ప్రవేశించిన దుండగులు అక్కడి సిసి కెమెరాలు, సైరెన్ వైర్‌లను కట్ చేశారు. ఎటిఎంలో నగదు చోరీకి యత్నించగా అదే సమయంలో పోలీసు పెట్రోలింగ్ వాహనాల సైరెన్ వినిపించడంతో అక్కడ నుంచి పరారయ్యారు. సిసి పుటేజీ రావడం లేదని గమనించి ఎస్‌బిఐ ఉద్యోగులు సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం అందజేశారు. వారిచ్చిన సమాచారం మేరకు డిఎస్‌పి వివేకానంద, సిఐ పైడపు నాయుడులు ఎటిఎంను పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఈ ఘటనపై వేలిముద్రలు సేకరించారు. అయితే ఎటిఎంలో నగదును దోచుకునేందుకు వీలు పడకపోవడంతో దుండగులు పరారైనట్లు సిసి పుటేజీ ఆధారంగా గుర్తించారు. ఈచోరీకి ఇద్దరు యువకులు ప్రయత్నించినట్లు సిసి పుటేజీలో గుర్తించారు. అయితే అందులో ఉన్న యువకులు ఎవరన్నది పోలీసులు గుర్తించే పనిలో ఉన్నారు. పాత నేరస్తుల చిత్రాలను సైతం పరిశీలిస్తున్నారు. నగరంలో చోరీలకు పాల్పడే బృందం సంచరిస్తోందని, అందువలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి సూచించారు.

ఎటిఎంను పరిశీలిస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం : అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఒ అప్పారావు

నష్టాలను అంచనా వేయాలి

ఇచ్ఛాపురం : నష్టాన్ని అంచనా వేసి త్వరితగతిన నివేదిక అందజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇంత వరకు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదని నివేదిక ఇచ్చారు. అలాగే ఇళ్లు కూడా నేలమట్టం కాలేదన్నారు. అనంతరం బహుదా వరద పరిస్థితి, ఇన్నేసుపేట, డొంకూరు గ్రామాలకు వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు. తీరప్రాంత గ్రామాల మత్స్యకారులతో మాట్లాడి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి, సిఐ ఎం.చిన్నంనాయుడు, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు బగాది వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని రావివలస, అయోధ్యపురం సచివాలయాల్లో కార్యదర్శులకు రైతులతో కలిసి సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు కేటాయించి పూర్తి చేయాలన్నారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి జిఒను విడుదల చేయాలన్నారు. 2023 ఖరీఫ్‌లో నష్టపోయిన పంటలకు బీమా పరిహారం చెల్లించాలన్నారు. రూ.2 లక్షల వరకు రైతులకు రుణలు ఇవ్వాలన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండ సాగుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. జిల్లాలో కొబ్బరిపార్కు ఏర్పాటు చేయాలన్నారు, ఎరువులు, పురుగు మందులను తక్కువ ధరకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, పాళిన సాంబమూర్తి, ఇప్పిలి మల్లేశ్వరరావు, సర్లాన సుధాకర్, పి.కృష్ణారావు ఎస్.గజపతిరావు, దిలీప్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎసెన్షియా ఫార్మా యాజమాన్యంపై చర్యలేవీ?

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం నేటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదో తెలపాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం మండలంలోని వంజంగికి చెందిన మృతుడు పైడి రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 21న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో గల ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై దిగ్భ్రాంతి చెందిన మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధిత కుటుంబాలకు ఆపన్న హస్తం అందించేందుకు ముందుకు వచ్చారన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.5 లక్షలు ప్రమాదం బారిన పడిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం ప్రకటించారని గుర్తు చేశారు. యాజమాన్యం పరిశ్రమలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ప్రమాదానికి దారి తీసిందన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కోట గోవిందరావు, మాజీ డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, అనీల్, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మాజీ స్పీకర్ సీతారాం

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎంజిఆర్ రూ.పది లక్షల విరాళం

పాతపట్నం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన విజయవాడ నగర ప్రజలకు బాసటగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.పది లక్షలు ఆర్థికసాయం అందజేశారు. సిఎం సహాయ నిధికి తన వంతుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాంప్ కార్యాలయంలో సోమవారం కలిసి చెక్కును అందజేశారు. అనంతరం విజయవాడ ఈస్టు16వ డివిజన్‌లో పర్యటించి భూపేష్ గుప్తా నగర్‌లో వరద నష్టం గణనలో ఇంటింటికీ వెళ్లి బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కలుషిత వాతావరణంలో ఉన్న ప్రజలకు నిత్యం వైద్య సదుపాయాలు కల్పించేటట్లు ఆదేశించారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు ప్రత్తిపాటి పుల్లారావు ఉన్నారు.

స్మార్ట్ ఇండియా హకాటన్ న్యాయనిర్ణేతగా రతన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పంజాబ్, హర్యానా ఉమ్మడి రాజధాని చండీఘర్‌లోని చండీఘర్ యునివర్సిటీలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించిన టెక్తోన్ 3.0 ఇంటర్నల్ హెకాటన్ స్మార్ట్ ఇండియా-24కు న్యాయ నిర్ణేతగా జిల్లాకు చెందిన బగాది జయప్రకాష్ లక్ష్మీరతన్ వ్యవహరించారు. దేశంలో బెస్ట్ ఎంట్రప్రెన్యూర్స్‌గా ఐటి, సైబర్ సెక్యూరిటీలో ప్రతిభ కనబరిచిన నలుగురిని ఎంపిక చేశారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన జెడిబి ఇన్ఫో టెక్ డైరక్టర్ అక్షయ్ డెబాస్, మధ్యప్రదేశ్‌కి చెందిన ధైర్య జోషి, పంజాబ్‌కు చెందిన జెడిబి సిఇఒ సాగర్ సింగ్‌తో కలిసి న్యాయ నిర్ణేతగా ఎంపికైన నలుగురిలో జయప్రకాష్ ఒకరు కావడం విశేషం. నగరంలోని చిన్నబజార్‌కు చెందిన జయప్రకాష్ టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్‌లో ఐటి గ్రాడ్యుయేషన్ ఇటీవల పూర్తిచేశారు. ప్రస్తుతం లియో గ్లోబల్ ఓవర్సీస్ (లండన్) డిజిటల్ మార్కెటింగ్ చీఫ్ అడ్వైయిజర్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తూ... జెడిబి ఇన్ఫోటెక్ ఢిల్లీకి బిజినెస్ అడ్వైయిజర్‌గా వ్యవహరిస్తున్నారు. వీటి ఆధారంగానే చండీఘర్ యూనివర్సిటీ న్యాయ నిర్ణేతగా ఎంపిక చేసింది. రెండు రోజుల పాటు చండీఘర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ల బృందంతో కలిసి ఎఐ సంబంధిత నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇచ్చే సూచనలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బిజినెస్ సలహాలు అందించారు. ఈ సందర్భగా జయప్రకాష్ మాట్లాడుతూ మొత్తం 600 బృందాలు నూతన ఆవిష్కరణలు ప్రదర్శించామన్నారు. అందులో 64 ఉత్తమ ఆవిష్కరణలను గుర్తించి తుది జాబితాలో 30 ఆవిష్కరణలను మాత్రమే ఎంపిక చేశారని తెలిపారు. 30 ఆవిష్కరణలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తాయని అన్నారు. ఈ ప్రక్రియకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినట్లు చెప్పారు. జయప్రకాష్ ఎంపికపై కుటుంబ సభ్యులు, ఆదిత్య కాలేజీ అధ్యాపకులు, సహా విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయనిర్ణేతలతో రతన్

ఆర్థికసాయాన్ని అందజేస్తున్న దాతలు

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సింగుపురానికి చెందిన కోట నాగరాజు గతవారం రోణంకి గ్రామ జంక్షన్ వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను శ్రీకాకుళం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జెమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. తలకు బలమైన గాయం కావడంతో ఆయనకు చికిత్స అందించడానికి ఖర్చుతో కూడుకుందని వైద్యులు చెప్పడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. నాగరాజు తండ్రి రిక్షా కార్మికుడు, నాగరాజు అద్దెకి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో దాతలసాయం కోసం అర్థించారు. విషయం తెలుసుకున్న సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు సోమవారం ఆస్పత్రికి వెళ్లి నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమవంతుగా రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పి.అవినాష్, బి.చంద్ర శేఖర్, పి.చరణ్, పి.వరప్రసాద్, డా. బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పోలాకి

రమణమూర్తి, ఎమ్మెల్యే

వర్షాలు, వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మండలంలోని మబగాం క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న సందర్భంగా ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని కోరారు. ప్రయాణాలు వాయిదా వేసుకుంటే మంచిదన్నారు. జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లో మట్టి మిద్దెల్లో నివసించే వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తుగానే అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కొనసాగుతున్న నిత్యాన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ఇల్లిసుపురం జంక్షన్ రైతుబజారు వద్ద నెలకొల్పిన వినాయక మండపంలో 11 రోజుల పాటు నిత్యన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వహక కమిటీ చైర్మన్ హారికా ప్రసాద్ తెలిపారు. సోమవారం కమిటీ సభ్యులు అప్పి, వాసు ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హారికా ప్రసాద్, శోభారాణి దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోలాకి: పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని తిలారులో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.గడ్డెమ్మ అధికారులను సూచించారు. ఈ మేరకు పారిశుధ్య పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు స్పందించి ఎవ్వరి ఇంటి వద్ద వారు పరిశుభ్రత చేసుకోవాలన్నారు. వాడి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు వంటివి గ్రామానికి దూరంగా వేయాలన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు అనంతరం బ్లీచింగ్ పిచికారీ చేయాలన్నారు. బావిల్లో క్లోరినేషన్ చేయాలని కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, ఇఒపిఆర్‌డి బి.రామారావు, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ పాల్గొన్నారు.

పోలాకి: పోలాకి, వెదుళ్లవలస గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను ఎంపిడిఒ ఉషశ్రీ పరిశీలించారు. ప్రధాన రోడ్డుకి ఇరువైపుల ఉన్న డ్రెయినేజీ కాలువలోని పలకలను ప్రొక్లెయినర్ తీయించారు. నీరు నిల్వ లేకుండా శుభ్రం చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఇఒపిఆర్‌డి పద్మావతి,కార్యదర్శి ఈశ్వరమ్మ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం మండలం కుందువానిపేటలో శ్రీకాకుళం లైన్స్‌క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యాన సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మత్స్యకార గ్రామమైన ఈ ప్రాంతంలో వరదల కారణంగా పారిశుధ్యం సరిగా లేక జనం రోగాల బారిన పడుతున్నారని తెలిసి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షులు లైన్ డా.బొడ్డేపల్లి సురేష్, కార్యదర్శి డాక్టర్ పైడి సింధూర పాల్గొని రోగులకు సేవలు అందించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ సూచనలతో గ్రామంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. అలాగే పాలు, పళ్లు, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ

పొందూరులో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

శ్రీకాకుళం అర్బన్ : పళ్లను పంపిణీ చేస్తున్న సభ్యులు

శిబిరంలో క్లబ్ మెంటర్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణం, సభ్యులు టెక్కం రాంగోపాల్, గుత్తు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పట్టణంలో ఎటువంటి వ్యాధులు, జ్వరాలు, డయేరియా వంటివి ప్రబలకుండా ముందస్తుగా తాడివలస పిహెచ్‌సి ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 93 మందికి వైద్యపరీక్షలు జరపగా ఐదుగురు వైరల్ జ్వరాలతో బాధపడుతుండగా, మరో ముగ్గురిని శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రమేష్‌నాయుడు, కె.నవీన్‌నాగ, పవన్ కల్యాణం, సిహెచ్ఒ సుగుణమ్మ, హెచ్‌ఎస్ రాములు, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవీయ విలువలకు మచ్చుతునక

కవిటి: ఆరేళ్ల క్రితం జరిగిన ఓ సంఘటన మానవీయ విలువలకు మచ్చుతునకగా నిలిచింది. ఆ సంఘటన రెండు కుటుంబాలకు బంధం ఏర్పాటు చేయడమే కాకుండా పరోపకారానికి మించిన సేవ లేదని రుజువు చేసింది. వివరాల్లోకి వెళ్తే... ఆరేళ్ల క్రితం మండలంలోని కొజ్జిరియా కూడలి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదంలో తొడ వద్దకు కాలు తెగి తీవ్రమైన గాయాలతో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతనికి కొంత దూరంలో పెట్రోలింగ్ పోలీస్ 108కు సమాచారం అందిస్తూ ఉన్నాడు. ఈలోగా అటుగా వెళ్తున్న ప్రస్తుతం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జానకిరావు మాస్టారు బాధితున్ని చూసి చలించిపోయారు. బాధితుని వద్దకు వెళ్లి ముందుగా తన జేబు రుమాలుతో రక్త స్రావం ఆపే ప్రయత్నం చేశారు. తరువాత తనతో తీసుకెళ్తున్న తాగునీటిని క్షతగాత్రునికిపోసి మాట్లాడే ప్రయత్నం చేశారు. అయినా బాధితుడు అపస్మారక స్థితికి చేరుకోవడం చూసి పెట్రోలింగ్ పోలీస్ అనుమతితో అతని గుండెపై ప్రాథమిక చికిత్స చేశారు. దీంతో స్పృహలోకి వచ్చిన బాధితునికి ధైర్యం చెబుతూ అతని

సన్మానిస్తున్న బద్రి కుటుంబసభ్యులు

ద్వారానే సమాచారం సేకరించారు. తన పేరు బద్రి అని, మెడికల్ రిప్రజెంట్‌గా పనిచేస్తున్నానని, చాపర గ్రామమని చెప్పారు. వెంటనే అతని ఫోన్‌లోనే వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు సమాచారం అందించి క్షతగాత్రున్ని ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ తరువాత అతను జైపూర్‌లో కాలు అమర్చుకుని ప్రస్తుతం జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన జానకిరావు మాస్టారుని సోంపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ విషయం తెలుసుకున్న బద్రి కుమార్తె సంధ్య, అల్లుడు విశాల్ తన తండ్రి ప్రాణాలతో ఉన్నందుకు కారణమైన జానకిరావు మాస్టారి రుణం తీర్చుకోవాలనుకున్నారు.

ఆకట్టుకుంటున్న మట్టి గణపతి

ప్రజాశక్తి- కవిటి

మట్టి గణపతి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ ఏడాది వినాయక విగ్రహాలు చాలావరకు సొంతంగానే తయారు చేసుకునేలా కమిటీ సభ్యులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అందులో భాగంగా మండలంలోని చిన్నఎర్ర గోవిందపుట్టుగలోని చింతామణి యువజన సంఘం సభ్యులు పది అడుగులతో మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సంఘ సభ్యుడైన ఎర్ర సోమేశ్ 15 రోజులపాటు శ్రమించి గణనాథుడికి ఘనమైన రూపం దుద్దాడు. ప్రస్తుతం ఆ విగ్రహం చూపరులను ఆకట్టుకుంటోంది.

సరుకులను పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సరుకుల పంపిణీ

పోలాకి: బుడుమేరు వాగు పొంగి ప్రవహించడంతో విజయవాడలోని కొన్ని ప్రాంతాలు అతలాకుతలమైంది. దీంతో ఎపి ప్రయివేట్ స్కూళ్ల అసోసియేషన్ ఆధ్వర్యాన సహాయక చర్యలు ముమ్మరం చేశారు. సోమవారం విజయవాడలో దుప్పట్లు, దుస్తులు, వాటర్ బోటళ్లను వరద బాధితులకు మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అప్సా నాయకులు సుందర్ రామ్, సుబ్రహ్మణ్య రాజు, మెట్ట జనార్ధనరావు, ఇలపండ గణపతిరావు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

బూర్జ: మండలంలోని మదనాపురానికి చెందిన మజ్జి నరసమ్మ కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ సోమవారం పరామర్శించారు. నరసమ్మ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు మజ్జి అప్పలనాయుడు, సురేష్‌ను పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ వైస్ ఎంపిపి పీరుకట్ల ప్రభాకర్, మండల బిసి సెల్ అధ్యక్షులు మామిడి దుర్గారావు, ఆదినారాయణ, జల్లు పోలినాయుడు, చక్రి, టిడిపి కార్యకర్తలు ఉన్నారు.

నరసమ్మ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న విశ్వప్రసాద్

ఘనంగా జెసిఐ వారోత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇచ్ఛాపురం : అన్నదానం చేస్తున్న జెసిఐ సభ్యులు

జూనియర్ చాంబర్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జెసిఐ) వారోత్సవాలను శ్రీకాకుళం మెయిన్, జెసిఐ శ్రీకాకుళం గ్రీన్‌సిటీలు సంయుక్తంగా సోమవారం చైతన్య సహకార జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జెసిఐ వ్యవస్థాపకులు జామి భీమశంకర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి డా.పైడి.సింధూర హాజరై జెసిఐ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జూనియర్ చాంబర్స్ జిల్లాలో ఏర్పాటైన నాటి నుంచి సేవా దృక్పదంతో ఎంతో మందికి సేవలందించిందన్నారు. కష్టంలో ఉన్న వారికి సాయపడడమే కాకుండా వారిలో మనో ధైర్యాన్ని కల్పించడానికి సభ్యులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలను అధ్యక్షులు కూన అనిల్ కుమార్, బెండాళం వరలక్ష్మి వివరించారు. ప్రాజెక్ట్ చైర్మన్ బొడిగె మధు, తమ్మినేని ఉషా రాణిలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అనురాగ నిలయంలో పిల్లలకు, వృద్ధులకు, అనాథలకు పండ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, ఉమామహేశ్వరరావు, దూసి సంతోష్, ఆర్.శ్రీనివాసరావు, జాడ సాయి, డా.బడాన దేవభూషణం, మండవల్లి రవి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జెసిఐ వారోత్సవాలు సందర్భంగా సీతయ్య ఫౌండేషన్‌లో వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. ముందుగా పాతబస్టాండ్ కూడలి వద్ద జెసిఐ పతాకాన్ని ఆవిష్కరించారు. జెసిఐ అధ్యక్షులు షణ్ముఖరావు మాట్లాడుతూ సోమవారం నుంచి ఈ నెల 15 వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అనుదీప్, స్వరూప్ కుమార్, ఢిల్లేసు, పవన్‌కుమార్, ప్రేమ్‌సాయి, మల్లేసు, జయదేవ్, మధుబాబు, వి.రాము, వెంకటేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసిరయ్యను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఆకట్టుకున్న కళా ప్రదర్శన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అనంతగిరి గ్రామం గొల్లవీధిలో జానపద కళాకారులు బోనెల అసిరయ్య, సినీ నటుడు అమ్మా రామకృష్ణ జానపద కళా ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. వినాయక నవరాత్రులు సందర్భంగా సోమవారం రాత్రి స్టేజ్ ప్రదర్శన నిర్వహించారు. అంతరించిపోతున్న పల్లె పాటలను ప్రదర్శించారు. అనాదిగా పొలాల్లో పనులు చేసుకునే సమయంలో కష్టాలు మార్చి హుషారుగా పని చేయడానికి రైతులు, రైతు కూలీలు పాడుకునే పాటలు, పశువులు, గొర్రెల కాపరులు తమపనులు చేసుకుంటూ మనసుకు ఆహ్లాదం కోసం పాడుకునే పాటలను ప్రదర్శించారు. అనంతరం గ్రామస్తులు అసిరయ్యకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పరిసర ప్రాంతాల ప్రజలు, మహిళలు, చిన్నారులు, యువకులు పాల్గొన్నారు.

మాజీ స్పీకర్‌కు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్, న్యాయవాది తంగి సత్యనారాయణ ఆదర్శమని రాష్ట్ర బార్ మెంబర్ గేదెల వాసుదేవరావు అన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో డిబిఎ ప్రెసిడెంట్ కిల్లారి ఈశ్వరరావు అధ్యక్షతన సోమవారం సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా రాజకీయంగా, న్యాయస్థానాల్లో సత్యనారాయన చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది టి.రాధాకృష్ణ, పబ్లిక్

మాట్లాడుతున్న వాసుదేవరావు

ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్, వై.మురళీమోహన్, పి.వి.ఆర్.దయాల్, పాడి సీతన్నాయుడు, పొన్నాడ వెంకటరమణ, భైరి జగదీశ్వరరావు, బి.ఎస్.చలం, చిన్నాల జయకుమార్, పార్థినరావు, తంగి శివప్రసాదరావు పాల్గొన్నారు.

రెల్లిగెడ్డలో స్నానానికి దూకుతున్న యువకులు

సరదా మాటున ప్రమాదం సుమా..

ప్రజాశక్తి- పొందూరు

ఉధృతంగా ప్రవహిస్తున్న రెల్లిగెడ్డలో సరదాగా యువత కేరింతలు కొడుతూ స్నానాలు చేస్తున్న ఈ దృశ్యం మండలం సింగూరు కూడలి సమీపంలోనిది. అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రెల్లిగెడ్డకు వరదనీరు పోటెత్తడంతో సమీప గ్రామానికి చెందిన యువకులు సరదాగా ఈత కొట్టారు. ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగు తున్నాయని వింటున్నప్పటికీ వాటిని లెక్కచేయకుండా వరదనీరు ఉధృతంగా ఉన్న సమయంలో ఈ విధంగా ఈత కొట్టడం మంచిది కాదని పలువురు చెబుతున్నారు.

పనులను పరిశీలిస్తున్న నాయకులు

వరద నీరు దారిమళ్లింపు

వజ్రపుకొత్తూరు: మండలంలోని హుకుంపేటలో సూరాడ వీధిలో చేరిన వరద నీటిని అధికారులు ప్రొక్లెయినర్ సహాయంతో సోమవారం దారిమళ్లించారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వీధిలో నీరు చేరిందని టిడిపి నాయకులు వంక రామారావు తెలిపారు. స్థానికులు పడుతున్న ఇబ్బంది సర్పంచ్ మామిడి భాస్కరరావు కార్యదర్శికి దృష్టికి తీసుకెళ్తారు. అధికారులు స్పందించి ప్రొక్లెయినర్‌తో పల్లపు ప్రాంతానికి తరలించారు. నీటిని పల్లపు ప్రాంతానికి తరలించారు. దీంతోని వీధి వాసులు ఊపిరిపీల్చుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి త్రినాథ్‌రెడ్డి, మోహనరావు పాల్గొన్నారు.

వెంకటేష్ అందరికీ ఆదర్శం

సోంపేట : మండలంలోని కొర్లం పంచాయితీ గోణకపాడుకు చెందిన నిరుపేద విద్యార్థి మంచాల వెంకటేష్ మద్రాస్ ఐఐటిలో పిహెచ్‌సి పూర్తి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. తండ్రి మంచాల ధర్మరాజు కూలి కాగా, జయమ్మలు టైలరింగ్ చేసుకుంటూ వెంకటేష్‌ను చదివించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. నూజివీడు ట్రిపుల్ ఐటిలో ఆరేళ్లపాటు సమీకృత కోర్సును పూర్తి చేశాడు. అనంతరం 2018లో గేట్లో 475వ ర్యాంకు తొలి ప్రయత్నంలోనే సాధించి మద్రాస్ ఐఐటికి ఎంపికయ్యాడు. బ్యాటరీ మెటీరియల్స్ విభాగంలో పిహెచ్‌డి చేసిన వెంకటేష్‌ను గ్రామస్తులు అభినందించారు.